

# చివరి యిల్లు

మధురాంతకం నరేంద్ర

**తొ**మ్మిదడుగుల పొడవున్న ఇంటి పైన, పదకొండడుగుల పొడవుండే రెండు అంతస్థులతో తనకంటే పెద్దవైన రెండేసి మూటల్ని మోసే కూలీలా కనిపించే మూడంతస్థుల ఇల్లు...

చాలా సంవత్సరాలుగా వెల్ల వేయించుకోని పొట్టి ప్రహరీగోడ. దానికి యెంత గట్టిగా ముందుకు తోసినా దగ్గరకు చేరని ఇనపగేట్లు రెండు... ప్రహరీ లోపలి కెళ్తూనే ఎండిపోయిన పాదులోంచీ, లావుపాటి మోకులా, మూడో అంతస్థు దాకా పాకిన మల్లెతీగ.

ప్రహరీగోడలో ఆ ఇంటి పేరు రాసిన రాతి పల కొకటి ఉందని, ఆ ఇంటిని అమ్మేశాక, నడచి వస్తూ చివరిసారిగా తిరిగి చూసినప్పుడుగానీ తెలియలేదు విజ్జీకి. దాదాపు పదకొండు నెలల తర్వాత, మళ్లీ ఇప్పుడు, ఆ పాత ఇంటి వైపుకు రావలసి రావడంతో దిగులూ వుద్వేగమూ కమ్మేశాయామెను. ఆ ముసలాళ్లిద్దరూ చని పోయారన్న సంగతి తనను వెంటాడుతూనే ఉండడంతో అటుకేసి రావడానికే జంకుగా ఉందామెకు.

*

పైని అంతస్థుల్లో అద్దెకుండే వాళ్లెప్పుడూ వాళ్ల వరండాలను దాటి లోపలికి వెళ్లే అవకాశాన్నివ్వలేదు విజ్జీకి. కానీ కిందింటిలో మాత్రం అణువణువూ తనకు తెలుసు. ఆ ఇంట్లో ఆ మూలున్న కుర్చీని ఇటు కాస్త కదల్చినా ముసలివాళ్లు మండిపడేవాళ్లు.

"ఈ కిందిల్లు ఆయన ఎల్డీసీగా ఉండేటప్పుడు కట్టింది. సగం రెంటుకిస్తే లోను ఇంట్రెస్టుకైనా వస్తుంది గదా అని రెండు పోర్షన్లుగా కట్టినాము. పై అంతస్థులు ఆయిన మేనేజరయినాక గట్టించినవి. పిల్లలకు తనీగా రూములుండాలనీ, బాత్రూంలలో బాత్‌టబ్బులు గూడా ఉండాలనీ పోష్‌గా కట్టినాం. ఇప్పుడు చూడు, వాస్తు ప్రకారం ఓనర్లు పైన్నే ఉండాలని తెల్సినా, పైకి యెక్కి దిగలేక, కింది పోర్షన్లు కలుపుకోని ఇక్కడ్నే ఉండి పొయినాం. ఉంటే సరిపొయ్యిందా? అనుభవించా లంటే అడిగిరావాల గదా!" అనేది ముసలావిడ. నడి వయస్సు వచ్చాక వచ్చిన థైరాయిడ్ రోగంతో నూట ఇరవైకేజీల బరువు దాటిపోతూ కదల్లేక కదిలే గున్నేనుగు లాగుండేదావిడ. "ఆపక్క పోర్షను నాయిన మాదిరి పీలగా, ఈ పక్కదేమో నీ మాదిరి బలంగా ఉంది గదమ్మా!" అని వేళాకోళమాడేది విజ్జీ.

"అప్పుడీ బేతంచర్ల బండలే పేషను... ఇప్పుడు గూడా ఫ్లోరింగెంత చల్లంగా ఉందో చూడు! పైనేసిన గ్రానైటు చూసేదానికి బాగుంటాదిగానీ భలే వేడి!" అనేవాడు ముసలాయిన. ఇంటి ముందు, పై అంతస్థు కెళ్లే మెట్లదారి పోగా మిగిలిన ఆ కాస్త స్థలంలోనే ఒక ప్పుడు పూలమొక్కలు కూడా నాటిందట ముసలావిడ. చాలని దానికి ఆ మూలలో చిన్న తులసికోట కూడా! ఆఫీసుకెళ్లే రోజుల్లో ముసలాయిన తన వెస్పా స్కూటర్ను ఆ సందులోనే ఇరికించేవాడట! ఇప్పుడు పై అంతస్థు లో అద్దెకున్న వాళ్లు తమ కార్ల కోసం పక్కనున్న ఫ్లాట్లలో పార్కింగ్ స్థలాన్ని అద్దెకు తీసుకున్నారు.

"ఇప్పుడైతే ఊరికి మధ్యలో ఉందిగానీ మేం ఇల్లు కట్టినప్పుడు ఇది ఔట్ స్కర్ట్స్. ఇంటిపని జరుగు తున్నా ఆయిన ఆఫీసుకెళ్లిపోయేవాడు. అప్పుడప్పుడూ గోడల పనికి నేను గూడా ఇటుకలు మోసినాను," అనేది ముసలావిడ, ఆ పని నిన్ననే చేసినట్టుగా.

"టౌను బస్సు ఆ గుడిదాకా వచ్చేది. అది తప్పి పోతే పిల్లల్ని నేనే కాన్వెంటుకు తీసుకెళ్లేవాణ్ణి. వాళ్ల కారియర్లకూ, పుస్తకాల సంచులకూ స్కూటర్లో చోటు చాలేది కాదు. ఫామిలీ సర్కస్సు చేశానప్పుడు," అంటూ మిగిలిన మూడు పళ్లూ వూగుతుండగా ముసలాయిన షోకేసులోని పాత ఫోటోను చూపెట్టేవాడు.

చిలుం పట్టిన ఫ్రేములోని నలుపూ తెలుపూ ఫోటోలో, స్కూటరు పైన అయిదేళ్ల కుర్రాడూ, బొచ్చు కుక్క పిల్ల నెత్తుకున్న యెనిమిదేళ్ల ఆడపిల్లా, స్కూటరు హేండిలు పట్టుకున్న నడివయసు మగవాడూ, సన్నగా రివటలాగున్న యువతీ... ఆ బలమైన మగవాడే యీ బక్క పలచటి ముసలాయననీ, ఆ నాజూకైన యువతే యీ లావుపాటి ముసలావిడనీ కనిపెట్టడం సులభం గాదు. ఫోటోలోని కుక్కపిల్లను చూపెడుతూ, "బన్నీ... యింట్లో బిడ్డ మాదిరుండేది. ముసలిదైపోయాక చచ్చిపొయ్యింది. అప్పుడు మా మధూ దిగులుతో యేడ్చీ యేడ్చీ జొరం తెచ్చుకుంది," అనేది ముసలావిడ తడిగా వున్న గోళీకళ్లు వింతగా మెరుస్తూండగా.

"ఆ బెడ్రూంలో, అదే మంచంపైన పుట్టాడు గోపీ. మా పెళ్లికి కొనిచ్చిన పరుపును వుచ్చ పోసీ పోసీ మూడు నెలల్లో పాడు చేసేశాడు," అంటూ నవ్వేదావిడ. "మా మధూ పుస్తకాల అలమరా పైన గోడ మీద పెన్సిలుతో పిచ్చిబొమ్మలు గీసి పాడు చేసేది. ఆ గీతలింకా లైట్‌గా కనబడతాయి చూడు," అనేవాడాయన. "ఆయిన కప్పుడు పిచ్చికోపం. బిడ్డను రెండు దెబ్బలేసేశారు," అని కోప్పడేదావిడ.

ఆ యిల్లు కట్టేసరికే ఆ ముసలాయిన వాళ్ల తండ్రి పోయాడట! యెక్కడో యిన్నూరు మైళ్ల దూరంలో వుండే వాళ్ల పల్లె నుంచీ వచ్చిన ఆయన తల్లి ఆ ముందు గదిలోనే వూపిరి వదిలిందట. ఆ సంగతి చెబుతూ ఆయన పరాకుగా వుండిపోయేవాడు. ఆ తరువాతెప్పుడో వోసారి, "మా అమ్మ చనిపోయిన టయిం మంచిది గాదు. ఆ రూమును మూడునెలలు మూతేయమన్నారు," అని చెప్పాడు. "ఆ మూడు నెలలూ గోపీ, మధూ భలే ఇబ్బంది పడిపోయారు," అందావిడ కచ్చిగా.

శివార్లలో యిల్లు కట్టుకున్నాక అగ్గిపెట్టె కావాలన్నా అప్పుడు కిలోమీటరు వెళ్లాల్సిందేనట. యిటువైపు దగ్గర్లోని పల్లెల నుంచీ పాలూ కూరగాయలూ తీసుకొచ్చి అమ్మేవాళ్లట! యింటి ముందు ఆవులూ, యెనుములూ వీధిలోనే పడుకునేవట! కాలనీలో అప్పుడు మూడే వీధులట! బీడీవో మునిరెడ్డి, ట్రెజరీ ఆఫీసర్ రంగనాథం, యంఆర్వో దిలావర్, బ్యాంకు మేనేజర్ రాజాశెట్టి- అంటూ ఆ తొలిరోజుల్లో యిక్కడ యిల్లు గట్టినవాళ్ల పేర్లను ముసలాళ్లు వారాల పేర్లు వల్లించినంత స్పష్టంగా చెప్పేవాళ్లు. వూరు పెరిగాక, వీధికి రెండువైపులా క్యూలో తోసుకులాడే మనుషుల్లా ఇళ్లు యిరుక్కున్నాయి. ఇండ్లు గట్టిన పాతవాళ్లంతా రిటయిరైపోయారు. వాళ్ల పిల్లలు వుద్యోగాల పేరుతో వూరినీ, దేశాన్నీ విడిచి పోయారు. "ఇండ్లు కాపాడుకోడానికి పాలుమారి చాలా మంది రియల్టర్లకు యిచ్చేశారు. వాళ్లు యిండ్లు పడగొట్టేసి, ఆచోట్లో ఫ్లాట్లు గట్టేసి, భిక్షమేసినట్టుగా రెండు మూడు ఫ్లాట్లిస్తే, దానికే మురిసిపోయినారు. అగ్గిపెట్టెలంత ఫ్లాట్లలో అఘోరిస్తా వుండారు," అంటూ ముసలావిడ భర్తను వురిమి చూసేది. "రియాల్టరొస్తే మాట్లాడినానని మీ అమ్మకు కోపం. వాళ్లకు దొరక్కుండా యీ కాలనీలో మిగిలుండే యిండ్లు రెండే రెండు... మనదీ, రిటైర్డ్ ఆడిటర్ సిద్ధయ్యదీ... మిగిలినవన్నీ షాపులుగా, ఫ్లాట్లుగా మారిపోయినాయి. అయినా దాని పిచ్చిగానీ నేనెందుకమ్ముతాను? ఇంకో రెండేండ్ల తర్వాత మా మధూ వచ్చి రెండో ఫ్లోర్లో నర్సింగ్‌హోం పెడతానంటోంది," అనేవాడు ముసలాయిన. "కాదు... ఫస్టు ఫ్లోర్లో మధూ నర్సింగ్‌హోం... రెండో ఫ్లోర్లో గోపీ... మనం కిందా..." అని సరిదిద్దేదావిడ.

విజ్జీ రాత్రుల్లో కూడా అక్కడే ఉండిపోవడం మొదలుపెట్టాక, "నువ్వు మధూ రూంలో పడుకో," అంది ముసలావిడ. వంటావిడ సాయమ్మ ఎప్పుడైనా రాత్రుల్లో ఉంటే గోపీ గదిలో పడుకునేది. ముసలావిడ మూలగదిని వదిలేది కాదు. ముసలాయిన హాల్లోనే పడగ్గదిని తయారుచేసుకున్నాడు. భాషాభేదం లేకుండా పొద్దస్తమానమూ ఏదోవొక సీరియల్ చూసేది ముసలావిడ. ముసలాయిన దినపత్రికను రెండుసార్లు నమిలేశాక, టీవీ ముందుకెళ్లి, న్యూస్‌పెట్టమని పోరేవాడు. "ఇంకో టీవీ కొనమని గోపీకి చెప్పాను నిన్న!" అని ఆవిడ ముఖం ముడుచుకునేది.

"మీ కొత్తూరోళ్లకు భలే తెలివి! నాయినా, అమ్మా అని పిలిచేసి ముసిలోళ్లను బుట్టలో ఏసుకునేసినావు నువ్వు!" అని సాయమ్మ ఎద్దేవా చేసేది.

"కాన్వెంటు మేడం మాదిరిగా సార్, మేడం అని స్టయిల్‌గా పిలస్తావు గదా నువ్వు?" అని అంటించేవాడు కాంపౌండరు లోకేశ్వర్.

"ఎంత చాకిరీ చేసినా మనం బంట్రోతులమే! పైసా పైసా కూడబెట్టి ఆ దేశాలు బట్టిపోయిన బిడ్డలకు

మిగిలించాలనే ముసిలోళ్ల తాపత్రయం!" అని తేల్చేసేది విజ్జీ.

ఎంబీబీయస్ చదివి, ఇంకో డాక్టర్ని పెళ్లి చేసుకుని, ఆస్ట్రేలియాలో ప్రాక్టీసు చేస్తున్న ఇద్దరు బిడ్డల తల్లినీ, ఇరవయ్యేళ్లుగా డెట్రాయిట్‌లో ఐటీ ఇంజనీరుగా నాటుకుపోయిన బట్టతల మనిషినీ, ఇంకా చంటిపిల్లలే ననుకుంటారు ముసలాళ్లిద్దరూ. అదే నయం! తానీ ముసలావిడను పెళ్లాడ్డానికి ముందు చూసిన పెళ్లిచూపులను పూసగుచ్చినట్టుగా చెబుతూ ముసలాయిన కుర్రాడిలా ఫోజుగొడతాడు. మైసూరుకూ, ఊటీకీ హానీమూన్ వెళ్లిన సంగతులు గుర్తు చేసుకుని సిగ్గుపడే ముసలావిడను చూసినప్పుడు రిపేరు షాపుల ముందు పేర్చిన పాత టైర్లు దొర్లుతున్న దృశ్యమే గుర్తుకొచ్చేది విజ్జీకి.

ఆ ఇంటికి పనిమనిషి కావాలని మేస్త్రీ అంజయ్య చెప్పినప్పుడు అంత దూరమెళ్లడం కష్టమని సందేహించింది విజ్జీ. 'వెళ్లిరావడం కష్టమైతే ఇక్కడే ఉండిపోవే!' అంది ముసలావిడ. సాయంత్రానికైనా పారిపోకపోతే, ఈ మందుల కంపు తగిలీ తగిలీ తానూ రోగిష్టినయిపోతానని భయపడింది విజ్జీ. పనిలో చేరిన రెండేళ్ల తర్వాత, పెద్దవాళ్లకు రాత్రుల్లో కూడా అటెండరు అవసరమనీ, పూర్తిగా ఇంట్లోనే ఉండిపోతే జీతం రెండింతలు పెంచుతాననీ అమెరికా నుంచి వాళ్ల కొడుకు ఫోన్ చేశాడు. ఇంట్లో డబ్బులవసరం. అప్పటినుంచీ విజ్జీది ఇరవైనాలుగ్గంటల ఉద్యోగమైపోయింది. జీతం పెంచామని ముసలాళ్లు అనవసరంగా పనులు పురమాయించసాగారు. విజ్జీ కావాలనిపనులు పాడుచేయడం మొదలుపెట్టింది. ఎక్కువగా మందలిస్తే ఈ పిల్లెక్కడ పని మానేస్తుందోనని ముసలాళ్లు గుక్కిళ్లు మింగేవాళ్లు.

కొంపలేవో మునిగిపోయినట్టుగా ముసలాయిన తెల్లవారక ముందే నిద్ర లేచేవాడు. బెడ్‌కాఫీ తాగేసి, గాలిలో విసురుకుపోయే చీపురుపుల్లలా టాయిలెట్‌కూ, బాత్రూంకూ పరుగెత్తేవాడు. ఆరుకంతా పేపరు రాకపోతే హంగామా చేసేసేవాడు. ముసలావిడ తీరిగ్గా లేచి రోడ్డు రోలరులా హాల్లోకి దొర్లుకొచ్చేది. టవలూ, పేపరూ ఆవిడ బండ చేతుల్లో గుండుకు తగులుకున్న గాలిపటాల్లా విలవిలలాడేవి. ఆవిడ స్నానం చేసి వచ్చాక బాత్రూం వరదొచ్చిపోయాక మిగిలే వంతెనలా తయారయ్యేది. ఆయన ఎనిమిదికీ, ఆవిడ తొమ్మిదికీ టిఫెను తినేవాళ్లు. పదకొండు పైన కాంపౌండరు లోకేశ్వర్ వచ్చి రొటీన్ పరీక్షలు చేస్తూ కబుర్లు చెప్పేవాడు. వెళ్లే ముందు 'హెల్తు బ్రహ్మాండంగా ఉందనీ, ఇంకా నూరేండ్లదాకా ఢోకాలేదనీ చెప్పమనీ ఆస్ట్రేలియా నుంచి ఆర్డరు. ఈ ముసిలోళ్లేమో నన్ను నానాఅనుమానాలతో చంపేస్తున్నారు,' అనేవాడు. మధ్యాహ్నం గిన్నెల్లోకి వడ్డిస్తే ముసలాళ్లిద్దరూ టీవీ చూస్తూనే గతికేవాళ్లు. ముసలావిడ పోయాక ముసలాయినకు స్పూనుతో తినిపించాల్సి వచ్చేది. అప్పటికి పక్షవాతంతో ముసలాయినకు నోరు వంకరై, అన్నమంతా చొక్కా పైన చిందేసేవాడు. నాప్‌కిన్‌తో అతడ్ని తుడిచాక తాను తినాలంటే విజ్జీకి డోకొచ్చేది. భోజనాలయ్యాక ముసలాళ్లు రెండు గంటలసేపు విషనీళ్లు తాగినట్టుగా నిద్రపోయేవాళ్లు. లేవగానే టీ, బిస్కెట్లూ... తర్వాత ముసలావిడ టీవీకీ... ముసలాయినతో కబుర్లు చెప్పడానికి తానూ... రాత్రి ఎనిమిదెప్పుడవుతుందా అని ఎదురుచూడ్డం... తర్వాత భోజనం. తొమ్మిదికి పడక... రాత్రుల్లో చప్పుడు వినబడ్డప్పుడు లేచి చూస్తే, ముసలాయిన కాలు విరిగిన కుక్కపిల్లలా బాత్రూం నుంచి తిరిగొస్తూ కనిపించేవాడు. అర్ధరాత్రీ అపరాత్రీ అనకుండా ముసలావిడ బండ గొంతుతో పెద్దగా అరుస్తూ నిద్ర లేపేసేది. ఆవిడను లేపి నిల్చోబెట్టడం ఒక మనిషికి కుదిరే పనికాదు. ఆవిడ వెళ్లొచ్చాక ఆ లెట్రిను కడగడమొక నరకం. పెద్ద గుండును కొండపైకి తోసినట్టుగా బరువుగా కదిలేది కాలం... అతికష్టం పైన కాలెండర్లో కాగితాలు తిరిగేవి. ఒకటా, రెండా, పన్నెండు సంవత్సరాలకు పైన కొన్ని నెలలు...

ముసలాళ్లిద్దరికీ మాత్రం రోజులు చాలా వేగంగా దొర్లిపోతున్నాయనుకునేది విజ్జీ. ఎప్పుడో ఇండియా రాబోయే వ్యక్తికోసం నెలల ముందు నుంచీ అన్నీ సిద్ధం చేసేవాళ్లు... ప్రతి శని ఆదివారాల్లో వచ్చే విదేశీ ఫోన్ల కోసం ఎదురుచూసేవాళ్లు. ముందుగా ముసలాయినే బాల్చీ తన్నేస్తాడనీ, ముసలావిడ తమను నానా హైరానా పెట్టాకగాని పోదనీ చెప్పేది సాయమ్మ. కానీ చిత్రంగా ఒకనాటి ఉదయం ముసలావిడ ఎంతకూ లేవలేదు. రాత్రెప్పుడో నిద్రలోనే పోయిందన్నాడు లోకేశ్వర్. భార్య అవతల శవమై పడుండగానే ముసలాయిన లక్షణంగా స్నానం చేసి, టిఫిను కూడా తిన్నాడని విస్తుపోయింది సాయమ్మ. థైరాయిడ్‌తో హింస బాధపడిన శరీరాన్ని విదేశాల నుంచి పిల్లలొచ్చేవరకూ ఉంచడం కుదరదనీ, అంత పెద్ద శరీరాన్ని మార్చురీకి తరలించడం కష్టమనీ డాక్టరు తేల్చేశాడు. కీళ్లూడిన కుర్చీలా ఎటుపడితే అటు వంగిపోతున్న ముసలాయినతో స్మశానంలో భార్యకు తల కొరివి పెట్టించి, ఇంటికి తీసుకొచ్చేసరికి లోకేశ్వర్

తల ప్రాణం తోకకొచ్చింది. ముసలావిడ పోయాక ముసలాయన్ను పిల్లలు తీసుకెళ్లిపోతారని పొరబడింది విజ్జీ. పీనుగలాంటి ముసలాయిన, వంటావిడ, పనిమనిషీ, కాంపౌండరూ- ముసలావిడ తప్ప మిగిలిన వ్యవహార మంతా యధావిధిగా కొనసాగింది. బంధువుల రాక పోకలు తగ్గిపోయాయి. భార్య పోయాక ముసలాయన నిండుగా ఆరేళ్లు లాగాడు.

ఆ కూతురూ కొడుకూ పేరుకైతే రెండు మూడు వారాల సెలవు పైన ఇండియాకొచ్చేవాళ్లు. వాళ్ల అత్త గారిళ్లలో కొన్నాళ్లూ, తిరుమల పేరుతో మూడురోజులూ, పార్టీలు, ఫ్రెండ్సూ, టూర్లూ పోగా ముసలాళ్లకు వాళ్లు కేటాయించగలిగేది మొక్కుబడిగా మూడునాలుగు రోజులే! ఉన్నన్నాళ్లూ బ్యాంకులూ, డిపాజిట్లూ, ఆస్ప త్రులూ, టెస్టులూ అని ఇంటిని బస్టాండుగా మార్చేసే వాళ్లు. వాళ్లు వెళ్లిపోయాకే ముసలాళ్లు హాయిగా ఊపిరి పీల్చుకోగలుగుతున్నారని గొణిగేది సాయమ్మ. తమకు జీతాలు ఇచ్చేటప్పుడూ, ఫోనూ, కరెంటు బిల్లూ కట్ట మన్నప్పుడూ ముసలాళ్లు డబ్బులు లెక్కబెట్టడం కోసమే బతుకుతున్నట్టనిపించేది విజ్జీకి.

చివరి రెండు సంవత్సరాల్లో ముసలాయిన మాట్లాడడం బాగా తగ్గించేశాడు. పేపరు కూడా పది నిముషాల్లో తిప్పి పారేసేవాడు. గంటకో అరగంటకో 'ఎండెక్కువగా ఉంది,' 'గాలే తోలడం లేదు,' వంటి మాటలతో నిశ్శబ్దాన్ని పగలగొట్టేవాడు. వంట గదిలో మిక్సీ మోగినా, ఫ్రిజ్ శబ్దం చేసినా సాయమ్మను కసిరే వాడు. సూపర్‌బజారు నుంచి సామాన్లు తెచ్చినప్పుడు అన్నీ జాగ్రత్తగా తనిఖీ చేసేవాడు. చనిపోయిన భార్య పక్కగదిలోనే ఉన్నట్టుగా చిత్రంగా మాట్లాడేవాడు. మూలగదిలోకి ఎవరు వెళ్లినా ఎగిరి దూకేవాడు. అప్పుడు శ్యాంరాజును జ్ఞాపకం తెచ్చుకుని, కసి తీరినట్టుగా సంతృప్తిపడేది విజ్జీ. ఇప్పుడైతే అతడితో సంబంధాలు తెగిపోయాయిగానీ, ఒకప్పుడు వారానికొక సారైనా పరిగెత్తుకొచ్చేసేవాడు శ్యాంరాజు. రాత్రి పన్నెండు తర్వాత సరాసరి ముఖద్వారంలోంచి వచ్చి తెల్లవారు ఝామున వెళ్లిపోయేవాడు. ఓసారి ముసలావిడ రాత్రి ఇంట్లో మగగొంతు విన్నాననీ, భయంతో తన నోరు పెగ ల్లేదనీ గొల్లుమంది. కలగని ఉంటావని ముసలాయిన దులిపేశాడు. ఆవిడపోయాక శ్యాంరాజు సరాసరి ఆ మూలగదిలోకే వెళ్లేవాడు.

కట్టెవాటం మనిషి గావడం వల్ల ముసలాయిన కష్టం లేకుండా దాటుకుంటాడని లోకేశ్వర్ నమ్మకంగా చెప్పేవాడు. కానీ ముసలాయిన తొమ్మిది నెలలు పడకలో పడ్డాకగానీ పోలేదు. చివరి రెండు నెలలు కోమాలో ఉన్నాడు. ఆహారం ట్యూబులోంచి వెళ్లింది. అన్నీ పడకలోనే! చాలనిదానికి ముక్కుల్లోంచీ, చెవు ల్లోంచీ రసి కారసాగింది. తుడవడం కోసం కేర్‌ఫ్రీ నాప్ కిన్లు డజన్లు డజన్లు తెచ్చారు. ఆయన పోయిన తర్వాత వాడని పాకెట్లు చూసి డబ్బులు తగలేశారని తమను కొట్టినంత పనిచేశాడు గోపీనాథ్. పడకపైన పడుకున్నది చాలక ముసలాయిన మార్చురీలో వారందినాలు పడు కున్నాడు. దహనం చేస్తున్నప్పుడు అస్థిపంజరమే మిగిలి నట్టుగా అనిపించింది. పడకలో పడిన కొత్తలో 'అక్కడ నొప్పి! ఇక్కడ నొప్పి' అని ఎవరి శరీరాన్ని గురించో చెబు తున్నట్టుగా చెప్పేవాడు. తొడలో కండరం కోసం వెతుకుతూ డాక్టరు బారెడు సిరెంజీతో నాలుగైదుసార్లు పొడిచినా కిక్కురుమనేవాడు కాదు.

'నీకు గోపీ అంటే ఇష్టం. మధూని పట్టించుకోవు,' అని భార్యను కోప్పడేవాడు. 'మీకు పిల్లల పైన ప్రేమే లేదు. మనమూ వాళ్ల దగ్గరికి పోదాం పదండి,' అని అరిచేదావిడ. పిల్లలు ఫోను చేసినప్పుడు ఒకరి పైన ఒకరు ఫిర్యాదులు చేసేవాళ్లు. 'మధూ నవజీవన్ నర్సింగ్ హోంలో రూం నెంబరు పదిలో పుట్టింది,' అనేదామె. 'కాదు, పన్నెండులో,' అనేవాడాయిన. రుజువు కోసం ఆ నర్సింగ్ హోమ్‌కు తీసుకెళ్లమంటారేమోనని కంగారు పడేది విజ్జీ.

తీరా తల్లి చనిపోయినప్పుడు వెనిజులాలో సర్వేలో ఉండడం వల్ల వారంవరకూ ఆ విషయమే తెలియలేదట గోపీకి. "నేను పోయినప్పుడే దేశంలో ఉంటాడో! వాడంటే వాళ్లమ్మకు ప్రాణం!" అని ముస లాయిన ఉదాసీనంగా పెదవులు చప్పరిస్తుంటే విజ్జీ గుండె దడదడలాడేది.

"ఈ ఇల్లు కట్టినప్పుడు నా వయస్సు ఇరవయ్యె యిదు... మా ఆయనకు ముప్ఫయి రెండు. మధూ ఏడాది పిల్ల," అని తారీఖులూ దస్తావేజులు వల్లించేది ముసలావిడ. డబ్బు పిచ్చితో కోడలు తమ కొడుకును దేశాంతరం పట్టించిందని ముసలాయిన వాపోయేవాడు. ఓసారి ఆస్ట్రేలియా నుంచి వచ్చిన మాధవి మొగుడు ముసలాయిన చెప్పాడని టాయిలెట్‌లో వెస్ట్రన్ కమ్మోడ్ పెట్టించాడు. అప్పటి నుంచీ టాయిలెట్ చిన్నదైపో యిందని ముసలావిడ విసుక్కునేది. ఆవిడను దహనం చేసి వచ్చిన రాత్రంతా మూలగదిలో బల్లొకటి కీచుకీచు

మని అరుస్తూనే ఉంది. ముసలావిడ దయ్యమై దాన్ని పూనిందేమోనని విజ్జీకి భయమేసింది.

మెష్‌లోంచి దూరే దోమలూ, వంటగది సింకు కింద సామ్రాజ్యాలు నిర్మించే బొద్దింకలూ, స్టోర్రూమ్‌లో రావిడి చేసే ఎలుకలూ, పెరట్లో గిన్నెలు దొర్లించే కాకులూ... 'మనుషులు రారుగానీ జంతువులన్నీ వచ్చి పోతాయి,' అని నిట్టూర్చేది ముసలావిడ. ముసలాయిన చనిపోయిన తర్వాత వచ్చిన కొడుకు బ్రాహ్మణుడ్ని పట్టుకొచ్చి రెండు రోజులు నట్టింట్లో తళిగేశాడు. అప్పుడు వీధి ప్రహరీ గోడపైన పెట్టిన పిండాన్ని ముట్టడానికి కాకులే కనిపించలేదు. ఊరు సిటీ అయిపోయాక కాకులూ, భిక్షగాళ్లూ పల్లెటూళ్ల కెళ్లిపోయారన్నారెవరో!

ముసలాయిన పోయాక, ఇంట్లోని వస్తువుల్ని పాత సామాన్ల వాడికి అమ్మేస్తున్నప్పుడు, పాతపెట్టెలో తన ఎలిమెంటరీ స్కూలు పుస్తకాలూ, యానివర్సరీ సర్టిఫికెట్లూ కనిపించాయి గోపీనాథ్‌కి. వాటిలోంచి బల్లి గుడ్లూ, చెదపురుగులూ రాలడం చూశాక విసుగ్గా చెత్త బుట్టలోకి విసరేశాడతను. పాత డైరీ తిప్పుతూ, 'మమ్మీ పోయినప్పుడు పెట్టిన ఖర్చు కూడా ఎంత డీటయిల్‌గా రాశాడో చూడు!' అంటూండగా అతడి గొంతు వణికింది.

ముసలాయినిచ్చిన చెక్కుల్ని బ్యాంకులో మార్చుకొచ్చినప్పుడల్లా 'అకౌంట్లో లక్షలున్నాయి. పెద్దాయిన వచ్చే జన్మకు కూడా దాచుకుంటున్నాడు,' అనేవాడు లోకేశ్వర్. ఇల్లు అమ్మేసిన తర్వాత గోపీనాథ్‌ను పరామర్శించడానికి వచ్చిన అతడి మామగారు- ఒంగోలు దగ్గర ఏదో పల్లెటూర్లో ఉంటాడాయన- 'మీ అమ్మానాన్నల్లా అంత అన్యోన్యంగా బతికిన జంటను నేను చూళ్లేదు,' అన్నాడు వాళ్లేదో తప్పు చేసిన ధోరణిలో. ముసలాయిన కన్నీళ్లు పెట్టడమన్నదే తాను చూడలేదంది సాయమ్మ. భార్యను స్మశానంలో తగలబెట్టి వచ్చాక ముసలాయిన భోరుమంటాడని ఎదురుచూసింది విజ్జీ. స్తబ్ధంగా ఉండిపోయాడుగానీ ఆ ముసలాయిన కళ్లల్లోంచి చుక్కయినా రాలలేదు. ఆస్ట్రేలియాలో మనవడికి జ్వరమొచ్చినా, అమెరికాలో మనవరాలు ముక్కు చీదినా ముసలావిడ బుడిబుడి ఏడ్పులు ఏడ్చేది. ఆవిడ బోండాం శరీరం నిండా కన్నీళ్లే ఉన్నట్టున్నాయనేవాడు లోకేశ్వర్.

'ఎప్పుడూ నైటీలేనా?' అని ముసలాయినోసారి కస్సుమన్నాడు. ముసలావిడకు చీర చుట్టేసరికి విజ్జీకీ, సాయమ్మకూ దేవతలు దిగి వచ్చారు. వాళ్లిద్దరూ ఒకప్పుడు వయస్సులో ఉండే ఉంటారనీ, ప్రేమలూ అలకలూ వాళ్లకూ తెలిసే ఉంటాయనీ అనిపించేది కాదు విజ్జీకి. పాతసామాన్లమ్ముతున్నప్పుడు దొరికిన చాటెడు ఆల్బమ్‌లలోని గ్రూప్ ఫోటోల్లో ముసలాళ్లెక్కడున్నారో విజ్జీ కనిపెట్టలేకపోయింది. ఇప్పుడా ఆల్బమ్‌లు ఏ దేశంలో, ఏ జంక్‌ట్రాష్‌లలో అలమటిస్తున్నాయోనని లోకేశ్వర్ బాధపడ్డాడు. స్టోర్‌రూంలోని పాత గిలకల ఊయలనూ, మూడుచక్రాల సైకిలునూ ఇనప సామాన్లవాడు వద్దనేశాడు. 'మా గోపీ భలే పిరికి. రాత్రుల్లో ఒంటరిగా పడుకునేవాడు కాదు. మా మధూకు బాత్రూం కెళ్లాలంటే మాత్రం తోడు కావల్సిందే!' అనేది ముసలావిడ. లాండ్ ఫోనూ, ఫ్రిజ్జూ, టీవీ ఔటాఫ్ మాడలని పాత సామాన్లవాడు విసుక్కున్నాడు.

మొదట్లో, 'బెండకాయ కూర చెయ్యి... పప్పుచారు చెయ్యి!' అని సాయమ్మకు పనులు పురమాయించే వాళ్లిద్దరూ. కొన్ని రోజుల తర్వాత 'ఆ కూర చెయ్యవూ, ఈ తాళింపు వండవూ!' అని బతిమాలేవాళ్లు. ఒకోసారి ఆ ఇంట్లో తానూ, సాయమ్మే యజమానుల్లా బతుకుతున్నట్టూ, ఆ ముసలాళ్లే తమ దయాదాక్షిణ్యాల పైన బతుకుతున్నట్టూ అనిపించేది విజ్జీకి. దాహమేస్తే నీళ్లు తాగాలన్నా, బాత్రూం కెళ్లి రావాలన్నా తాము తప్ప మరో దిక్కులేదు వాళ్లకు. ఒక్కోసారి తమకేదో పని చెప్పబోయి, సందేహిస్తూ ఆగిపోయేవాళ్లు. తలలు వంచుకుని గొణుక్కునేవాళ్లు.

తానుద్యోగం చేసినప్పుడు, తన భార్య ఒక చేత్తో ఇంటి పనులన్నీ చేసుకుపోయేదని ముసలాయిన మెచ్చుకునేవాడు. అప్పట్లో ఆయన చాలామందికి సహాయాలు చేశాడనీ, వాళ్లెవరికీ కృతజ్ఞత లేదనీ ఆవిడ బాధపడేది. ఒక్కోసారి తామటు వెళ్లగానే మాట్లాడడం మానేసే ముసలాళ్లని చూసి, వాళ్లకు తమకు తెలియని రహస్యాలేమో ఉన్నాయని అనుమానపడేది సాయమ్మ. వొకోసారి వాళ్లెందుకు సిగ్గుపడుతున్నారో, ఎందుకు చిరాకుపడుతున్నారో అర్థమయ్యేది కాదు.

ఇంటి బేరం కుదిర్చిన బ్రోకరు 'మీ మమ్మీలా థైరాయిడ్‌తో అన్నేళ్లు పోరాడాలంటే దమ్ముండాలి. అట్లాంటి భార్యను అలా చూసుకున్నాడంటే మీ డాడీకి గట్సెక్కువ!' అన్నాడు గోపీతో. ఓసారి ఇండియా వచ్చి వెళ్తూ, 'మా మమ్మీడాడీలకు చచ్చిపోతామనే భయముంది. ఎవరైనా చావక తప్పదు. అన్నిటికీ రెడీగా వుండాలి!' అని గోపీనాథ్ విసుక్కోవడం విజ్జీకి జ్ఞాపకమొచ్చింది. విజ్జీ ఒంటరిగా కనిపించినప్పుడు అదోలా చూసేవాడతను. అతను లోకం తిరిగినవాడనీ, అన్ని

విషయాలనూ డబ్బులతోనే లెక్కబెడతాడనీ విజ్జీకి త్వరలోనే తెలిసిపోయింది.

కాఫీ కప్పో, గాజుసీసానో పగిలితే ముసలావిడ ప్రాణం విలవిలలాడేది. అలా ఇల్లు గుల్ల చేస్తే తన పిల్లలకేం మిగులుతుందని ఆక్రోశించేది. 'ఇంటికి రంగులు కొట్టాలి... ఫస్టుఫ్లోరుకు నీళ్లెక్కడం లేదు... రెండో అంతస్థు గలీజైపోయింది,' అని పిల్లలకు ఫోన్లో నివేదికలు సమర్పించేవాడు ముసలాయిన. 'విజ్జీ వేస్టు చెయ్యదు. సాయమ్మ భలే పొదుపు,' అని తమను ఉబ్బించడం వాళ్ల లౌక్యమేనని విజ్జీకి తెలుసు. పాత రశీదులంతా పొడవాటి కమ్మీకి గుచ్చేది ముసలావిడ. ఆవిడ పోయాక ముసలాయినా పని కొనసాగించాడు. మాంసం అంగడిలో వేలాడే మేక తొడలా తయారైన రశీదుల బొత్తిని చూసినప్పుడు, 'చాదస్తం!' అని తేల్చేశాడు గోపీనాథ్.

సామాన్లు రకరకాలుగా అమ్మేశాక, 'ముసలాయిన పోయాక ఇల్లే బోసిపోయింది,' అన్నాడు లోకేశ్వర్ విచారంగా. లావెటరీ సింకులో చీమలు తినగా మిగిలిన బల్లి అస్థి పంజరమొకటి వెక్కిరిస్తున్నట్టుగా కనిపించింది. పెరటిచెట్టు గూట్లోంచీ పడి పగిలిన పిచ్చుక గుడ్లు ఇంటినంతా నీచువాసనతో కమ్మేశాయి. బ్రోకరు కొత్త పార్టీని తెచ్చేలోగా గోపీనాథ్ రెండు సీసాల రూం ఫ్రెషనర్ స్ప్రే చేశాడు.

'ఇప్పుడిక్కడ స్క్వేర్ ఫీట్ లాక్స్ చేస్తుంది. మీ డాడీది వైజ్ ఇన్వెస్ట్‌మెంట్,' అన్నాడు బ్రోకరు.

'అప్పుడు కాలనీ అంతా ఖాళీలే. ఇద్దరు పిల్లలకూ రెండు ప్లాట్లు కొనమంటే ఆయన వినలేదు,' అని వాపోయేదావిడ. 'అప్పుడు నా జీతమెంతో తెలుసా? ప్లాటు రేటెంతో తెలుసా?' అని ఆయన లెక్కలు చెప్పేవాడు.

ముసలాయినకు దినం చేసిన రోజున గోపీనాథ్ గుండు కొట్టుకోవడం చూసి విజ్జీకి నవ్వొచ్చింది. ఇంటిని కొనుక్కున్న వ్యక్తి కప్పగించి వెళ్లేముందు విజ్జీకీ, సాయమ్మకూ, లోకేశ్వర్‌కూ బక్షీసు ఇస్తూ, 'మీ రుణం డబ్బుల్తో తీరదు. మీకే అవసరమొచ్చినా నాకు ఫోను చేయండి,' అన్నాడు గోపీనాథ్. అతడిచ్చిన విజిటింగ్ కార్డు తీసుకుని పదిహేను మైళ్ల దూరంలో ఉన్న తన ఇంటికి తిరిగొచ్చింది విజ్జీ. సంవత్సరాల తరబడీ రాత్రీ పగలూ ముసలాళ్లకు తోడుగా ఆ ఇంటిలో ఉండిపోయాక, తన ఇల్లే పరాయిదిగా, తనవాళ్లే పరాయి వాళ్లుగా అనిపించారామెకు. మరునాడేం చేయాలో తోచక, రెండు బస్సులూ, షేర్ ఆటోలూ మారి ఆ ఇంటి దగ్గరికే వచ్చింది. ఇంటికి తాళం వేలాడుతోంది. గోపీనాథ్ తన అత్తగారింటి కెళ్లాడేమో! లేకపోతే విమానమెక్కేసి ఉంటాడు.

ముసలావిడొకసారి నర్సింగ్‌హోమ్‌లో చేరినప్పుడు విజ్జీ కూడా అక్కడే ఉండిపోయింది. ఇంటికెళ్లి, చెత్త చిమ్మి, దీపం పెట్టేవరకూ ముసలావిడ విజ్జీని వేధించి పారేసింది.

మూడు అంతస్థులకూ వేలాడుతున్న బీగాలను దీనంగా చూస్తూ వెనుదిరి గింది విజ్జీ. మూసిన తలుపుల వెనక నుంచి ముసలాళ్లు పిలుస్తున్నట్టుగా అనిపించగానే భయంతోనూ, బాధతోనూ విచలితురాలైపోయిందామె.

*

ఒకే ఒక సంవత్సరంలోపే ఇంత మార్పెలా వచ్చిందో అర్థంకాక విస్తుపోయింది విజ్జీ. పొరబాటున తాను వేరే వీధిలోకి వచ్చానేమోనని కంగారుపడింది. ఆ వీధిలో అక్కడ దశాబ్దాలుగా ఉండిన పాత మూడంతస్థుల ఇంటినెప్పుడు కూల్చేశారో, దాని అవశేషాల నెలా మాయం చేశారో, అదేచోటులో ఈ కొత్త షాపింగ్‌మాల్ నెప్పుడు కట్టారో తెలియక అయోమయపడింది.

మాల్ ఎన్ని అంతస్థులుందో కిందికి తెలియడం లేదు. కింది అంతస్థు గాజు తలుపులతో రకరకాల వస్తువుల్ని ప్రదర్శిస్తూ జనాలను కవ్విస్తోంది. లోపల వినియోగదార్ల రద్దీ ఎక్కువగా ఉంది. మొద్దుబారిన బుర్రతో వెనుదిరగబోయిన విజ్జీ, 'సేల్స్ గర్ల్స్ కావలెను' అనే నోటీసును చూడగానే ఆగిపోయింది. నోటీసు కిందున్న బాణం గుర్తుకేసి నడిచిందావిడ. అక్కడ తలుపుల దగ్గర నుంచీ కిందికి మెట్లున్నాయి. జిగురుగా ఉన్న మెట్ల పైన, చెత్తను తొక్కుకుంటూ కిందికి దిగింది విజ్జీ.

కింద స్టోర్‌లో రకరకాల మూటలూ అట్టపెట్టెలూ డ్రమ్ములూ కిక్కిరిసిపోయి వున్నాయి. వాటి మధ్యలో కూరుకుపోయిన మనుషులు ప్లాస్టిక్ కవర్లలోకి సామాన్లు నింపుతున్నారు. అడుగు జారడంతో తూలి సామాన్ల పాకెట్ల పైకి వాలింది విజ్జీ.

"ఏయ్! ఎవరు నువ్వు? ఇక్కడేం పని?" అంటూ బానెడు పొట్ట కనబడేలా పాంటులోకి చొక్కా దోపుకుని, ఊడిపోయే బస్తాలాగున్న మనిషి గద్దించాడు.

విజ్జీ బొంగురుపోతున్న గొంతుకతో, "సేల్స్‌గర్ల్! సేల్స్‌గర్ల్?" అంది.

‘రేయ్ వాచ్‌మేన్! ఎవరు పనికోసరమొస్తారో, ఎవరు ఏదైనా కొట్టుకుపోదామని వస్తారో తెలుసుకోలేవా నువ్వు! పాతికేళ్లు దాటిన వాళ్లొస్తే రానివ్వద్దు... ముందు దీన్ని బయటికి తరుము!’’ అని గొంతు చించుకున్నాడు బస్తా.

విజ్జీ బెంబేలు పడుతూ పైకి గెంతింది. మాల్ బయటికొచ్చే వరకూ తిరిగి చూడలేదు.

తానోసారి దొంగతనంగా రెండు కేజీల మినప్పప్పు తీసుకెళ్తూ ముసలావిడకు రెడ్‌హాండెడ్‌గా దొరికి పోయింది. ‘పిండి వేసుకొద్దామని తీసుకెళ్తుంటే నన్నే అనుమానిస్తావా? ఇలాగైతే పనికిరాను,’ అని దబాయించింది విజ్జీ. సాయమ్మ కూడా తక్కువేం తినలేదు. తాము పనికి రావడం మానేస్తే వాళ్లు మళ్లీ కొత్తవాళ్ల కోసం వెతుక్కోవాలనీ, అంతవరకూ ఇంట్లో అన్ని పనులూ ఆగిపోతాయనీ ముసలాళ్లకు తెలుసు. ఆ తరువాత ముసలావిడ చూసీచూడనట్టుగా ఉండిపోయింది.

వీధిలో పదడుగులు వేశాక పాత రెండంతస్థుల ఇంటి ముందు కొచ్చి, గభాలున ఆగిపోయింది విజ్జీ. ఆ వీధిలో ఇప్పుడు ఆ ఇల్లు తప్ప మిగిలినవన్నీ షాపులై పోయాయి. ఆ చివరి ఇంటి చివర పాత తలుపుల కవతల ముసలి శరీరమేదో కదలాడినట్టుగా తోచడంతో విజ్జీ బెదిరిపోయి, ముందుకు దూసుకెళ్లిపోయింది.

*తెలుగు వెలుగు, సెప్టెంబర్ 2013*

